# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-06-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్రాల మధ్య సాంస్కృతిక ఐక్యత, పరస్పర అవగాహనను పెంపొందించడమే 'ఏక్ భారత్--శ్రేష్ఠ భారత్' ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.**

**2. ఆంధ్రప్రదేశ్‌లో అపరిష్కృతంగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు, ఇళ్ల స్థలాల క్రమబద్దీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**3. ధాన్యం కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.**

**4. యువత క్రీడలను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు.**

==========================

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ లోక్‌భవన్‌లో తెలంగాణ, గోవా, సిక్కిం రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిన్న ఘనంగా నిర్వహించారు. 'ఏక్ భారత్--శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ వేడుకల్లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రసిద్ధి చెందిందని అన్నారు. అదేవిధంగా, సిక్కిం దేశంలో అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రాల్లో ఒకటిగా, జీవ వైవిధ్య రాష్ట్రంగా గుర్తింపు పొందిందని తెలిపారు. గోవా తన అద్భుతమైన సముద్ర తీరాలు, పర్యాటక ఆకర్షణలతో దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. రాష్ట్రాల మధ్య సాంస్కృతిక ఐక్యత, పరస్పర అవగాహనను పెంపొందించడమే 'ఏక్ భారత్--శ్రేష్ఠ భారత్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలుపుతూ,

వాయిస్..30.. సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అపరిష్కృతంగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు, ఇళ్ల స్థలాల క్రమబద్దీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గృహనిర్మాణ శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, జీపీఎస్ ట్రాకింగ్‌ను సమర్థంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

---------------------------

తెలంగాణలో జనసేన పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్రంలో పర్యటించి ప్రజలతో మమేకమవుతానని తెలుపుతూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

యువత వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళంలో – కార్గిల్ పార్క్ వద్ద నిర్వహించిన ఎర్రన్న క్రీడా ఉత్సవంలో భాగంగా ఎంపీ కప్–2026 క్రికెట్ ఫైనల్ పోటీలను ఆయన నిన్న వీక్షించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విజేతలకు ట్రోఫీలు, నగదును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, యువత మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి వ్యాయామం, క్రీడల వైపు అడుగులు వేయాలని సూచించారు.

---------------------------

ఢిల్లీలో జాతీయ పంచాయతీ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఈరోజు జరగనుంది. గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల పనితీరులో ప్రతిభ కనబరచిన పంచాయతీలకు పురస్కారాలను కేంద్ర పంచాయత్ రాజ్ శాఖ ప్రధానం చేయనుంది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన జాతీయ పంచాయతీ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ పలు జాతీయ పురస్కారాలను దక్కించుకుంది.. వివిధ విభాగాల్లో గ్రామీణాభివృద్ధి, సుస్థిర పాలన, మహిళా సాధికారత, మౌలిక వసతుల కల్పన, సుపరిపాలనలో ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు ఈ అవార్డులు లభించాయి. అలాగే చిత్తూరు జిల్లాలోని కుప్పం ఉత్తమ బ్లాక్ పంచాయతీగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. దీనిపై కుప్పం పంచాయతీ అధికారి సుధాకర్ రావు మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకి ఆంధ్రప్రదేశ్ కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రముఖ డిజిటల్ మౌలిక వసతుల సంస్థ ఎయిర్‌ట్రంక్ వ్యవస్థాపకులు రాబిన్ ఖుదాతో ముఖ్యమంత్రి నిన్న అమరావతిలో సమావేశమయ్యారు. విశాఖపట్నాన్ని ప్రపంచ స్థాయి డిజిటల్ హబ్‌గా అభివృద్ధి చేసే అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ, విశాఖలో 2 గిగావాట్ల సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుపై చర్చలు జరిగాయని తెలిపారు.

-------------------------

ధాన్యం కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొని మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అయితే కేంద్రం కేటాయిస్తున్న నిధులను వినియోగించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం సహకరించడం లేదని భావిస్తే, ఆ విషయంపై ప్రధానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు.

-------------------------

తుంగభద్ర ప్రాజెక్టు భద్రత, ఆధునీకరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ మరమ్మతులు చేపట్టిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో తుంగభద్ర నది బోర్డు చైర్మన్ ఎస్.ఎన్. పాండే మంత్రితో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టులో ఒకే సమయంలో 51 కోట్ల రూపాయల వ్యయంతో 33 కొత్త గేట్లను నిర్మించడం దేశంలోనే రికార్డుగా నిలిచిందన్నారు. తద్వారా రాయలసీమకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చగలిగామని చెప్పారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో జరిగిన డీఎస్సీ నియామకాల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపించారు. విశాఖపట్నంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, డీఎస్సీ నిర్వహణలో పారదర్శకత లోపించిందని విమర్శించారు. ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టిందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలను చేపట్టిందని నిన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియపై జరుగుతున్న దుష్ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

-------------------------

విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా తమిళనాడు వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈరోజు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతుందని పేర్కొంది.

తెలంగాణలోనూ రానున్న మూడు రోజులు వివిధ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================